టీవీలకు అతుక్కుపోయిన జనం

జగిత్యాల/కథలాపూర్: ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ సందర్భంగా శనివారం జిల్లా ప్రజలంతా టీవీలకే అతుక్కుపోయారు. పాకిస్తాన్‌ను భారత్ చిత్తుచేయడంతో క్రీడాభిమానుల ఆనందాలకు హద్దులు లేకుండా పోయాయి. మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠతో చూశారు.


జిల్లాకేంద్రంలో టీవీ చూస్తున్న క్రికెట్ అభిమానులు


కథలాపూర్: సిరికొండలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న అభిమానులు

న్యూస్‌రీల్

పకడ్బందీగా కోడ్ అమలు


కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. అధికారులతో శనివారం సమావేశమయ్యారు. టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కోడ్‌కు ముందు 6,603 రకాల గోడలపై రాతలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఇతరత్రా వాటిని తొలగించామని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు ఇప్పటివరకు 115.50 లీటర్ల లిక్కర్ సీజ్ చేశామని, నాలుగు కేసులు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారని తెలిపారు. అలాగే 4.135 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ బాటిల్స్ సీజ్ చేశారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా డబ్బు, మద్యం తరలిస్తే కంట్రోల్‌రూం 1800 425 7620, 1950 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వందశాతం వేయాలి


రాజారంలో రికార్డులు పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మల్యాల: పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తి చేయాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో నీలారపు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాజారంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం సందర్శించారు. వ్యాక్సిన్ నమోదు రికార్డులు పరిశీలించారు. స్థానికులకు క్షయ, కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాధ, ఏఎన్ఎం బి.శకుంతల, ఆశ కార్యకర్తలు జి.కల్యాణి, జి.సులోచన తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంటకు 'మద్దతు'పై ఎంపీ స్పందించాలి


మాట్లాడుతున్న కృష్ణారావు

మెట్‌పల్లి: పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్.. ఆ పంటకు మద్దతు ధర చెల్లిస్తామని ఎందుకు చెప్పడం లేదని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు ప్రశ్నించారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా గెలిపిస్తే పసుపుబోర్డు, నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తాజాగా ఏడు నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపిస్తేనే ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ పసుపు క్వింటాల్‌కు రూ.12వేల మద్దతు ధర ఇస్తామని, బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి శేర్ నర్సారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కొమిరెడ్డి లింగారెడ్డి, గంగోని క్రాంతి, ముఖీమ్ తదితరులున్నారు.

దారులన్నీ తెలంగాణ భవన్‌కే..



- నేడు బీ ఫారాలు అందుకోనున్న 'కారు' పార్టీ అభ్యర్థులు
- విజయంపై ధీమాతో రాజధానికి ప్రయాణం
- మూడోసారి అందుకునే వారే అధికం..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల పరుగుపందెంలో ముందంజలో ఉన్న అధికార బీఆర్ఎస్ పార్టీ.. బరిలో నిలిచే అభ్యర్థులకు ఆదివారం బీ ఫారాలు అందించనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీ బరిలోకి దిగనున్న అభ్యర్థులంతా ఉదయం 9గంటల వరకు తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నారు. అక్కడ 11 గంటలకు సీఎం చేతుల మీదుగా బీ ఫారాలు అందుకోనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త అభ్యర్థులతో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కాసేపు మాట్లాడుతారు. భోజనం అనంతరం వారంతా తిరుగుముఖం పడతారు. హుస్నాబాద్‌లో సభా ఏర్పాట్ల నేపథ్యంలో కరీంనగర్, సిద్దిపేట, హుస్నాబాద్ నేతలు కాస్త ముందుగానే బయల్దేరుతారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు చాలామంది రాజధానికి చేరుకున్నారని సమాచారం. వీరిలో ముగ్గురు తొలిసారి, ఇద్దరు రెండోసారి, ఆరుగురు మూడోసారి, ఒకరు ఐదోసారి, మరొకరు ఏడోసారి బీ ఫారాలు అందుకోనుండడం గమనార్హం.

విజయంపై ధీమా..

పదేళ్లుగా పార్టీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులే తమను తిరిగి గెలిపిస్తాయని గులాబీ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుచుకున్న 88 సీట్లకు మించి ఈసారి విజయం సాధిస్తామంటున్నారు. గత రెండు ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 12 స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తూ వచ్చిన తాము.. ఈ సారి 13కు 13 సీట్లు గెలిచి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శనివారంతో అమావాస్య ముగియనుంది. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ సభతో పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి సమరశంఖం పూరించనున్నారు. ఆ వెంటనే బీ ఫారాలు అందుకున్న అభ్యర్థులంతా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయనున్నారు. చాలామంది నాయకులు ఎన్నికల ప్రచార రథాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు.

తొలిసారి అందుకునేవారిలో
- డాక్టర్. కె.సంజయ్ (కోరుట్ల) : తొలిసారి
- పాడి కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్): తొలిసారి
- సీహెచ్ లక్ష్మీనరసింహారావు (వేములవాడ): తొలిసారి

సేవతోనే సంతృప్తి



ఏడో సారి బీఫాం అందుకుంటున్నాను. నా జీవితానికి ఇది ఎంతో గొప్పది. ఇంత ఆనందం ఎందులోనూ రాదు. ప్రజలకు సేవ చేయడమే నా భాగ్యం. దీనికి వెల కట్టలేం. నాకు సంతృప్తిగా ఉంది. మొదటిసారి ఎన్టీరామారావు చేతులమీదుగా బీఫాం అందుకోగా.. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఏడోసారి అందుకుంటున్నాను.

– కొప్పుల ఈశ్వర్, సంక్షేమ శాఖ మంత్రి

చాలా సంతోషంగా ఉంది



కేసీఆర్ చేతుల మీదుగా మూడోసారి బీఫాం అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రజలే నా కుటుంబం. ప్రజాసేవే నా ఊపిరి. నాకు సీఎం కేసీఆర్ ప్రజలకు సేవ చేసే బాధ్యత అందించారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా. జగిత్యాలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి మరెక్కడా లేదు.

– డాక్టర్ సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

గర్వంగా ఉంది



చాలా గర్వంగా ఉంది. తెలంగాణ గడ్డకు సేవ చేయడం నా అదృష్టం. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా. ఇది మాటల్లో చెప్పలేను. ఇది నాకు సీఎం కేసీఆర్ ఇచ్చిన గొప్ప అవకాశం. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

– కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి

ఆనందంగా ఉంది



నాపై విశ్వాసంతో టికెట్ కేటాయించి నేడు బీఫారం అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. మూడు నెలలుగా అన్నివర్గాల ప్రజలతో మమేకం అయ్యాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయి. తప్పకుండా భారీ మెజారిటీతో గెలిచి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు కృషి చేస్తాను. – చల్మెడ లక్ష్మీనర్సింహారావు, వేములవాడ అభ్యర్థి

ఈ దఫాతో ఎవరెన్నిసార్లంటే..

- కొప్పుల ఈశ్వర్, ధర్మపురి: ఏడుసార్లు (2004, 2008, 2009, 2010, 2014, 2018, 2023)
- కేటీఆర్, సిరిసిల్ల: ఐదుసార్లు (2009, 2010, 2014, 2018, 2023)
- గంగుల కమలాకర్, కరీంనగర్: మూడుసార్లు (2014, 2018, 2023)
- పుట్ట మధు మంథని: మూడుసార్లు (2014, 2018, 2023)
- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి: మూడుసార్లు (2014, 2018, 2023)
- రసమయి బాలకిషన్, మానకొండూరు: మూడుసార్లు (2014, 2018, 2023)
- వొడితెల సతీశ్‌బాబు, హుస్నాబాద్: మూడుసార్లు (2014, 2018, 2023)
- డాక్టర్ సంజయ్, జగిత్యాల: మూడుసార్లు (2014, 2018, 2023)
- సుంకె రవిశంకర్, చొప్పదండి: రెండుసార్లు (2018, 2023)
- కోరుకంటి చందర్, రామగుండం: రెండుసార్లు (2009, 2023)

నేరస్తులపై 'పీడీ'కిలి


దొంగతనాలకు పాల్పడ్డ సంతోష్, అజయ్‌కి పీడీయాక్ట్ పత్రాలు అందజేస్తున్న సీఐ కోటేశ్వర్ (ఫైల్)

- అక్రమార్కులపై పోలీసుల ఉక్కుపాదం
- 2019 నుంచి ఇప్పటి వరకు 28 మందిపై పీడీ యాక్ట్
- నేరాలు అదుపు చేసేందుకే అంటున్న ఉన్నతాధికారులు

జగిత్యాలక్రైం: తరుచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ప్రజల్లో భయాందోళన సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెడుతున్నారు. ఒక్కసారి కేసు నమోదై మళ్లీ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి పీడీయాక్ట్‌లు అమలు చేస్తున్నారు. జిల్లాలో 2019నుంచి ఇప్పటి వరకు నేరాల్లో ప్రమేయం ఉన్న 28మందిపై పీడీయాక్ట్ నమోదు చేయడంతో జైలు ఊచలు లెక్కిస్తున్నారు.

త్వరితగతిన శిక్షలు

జిల్లాలో వరుస నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలులో పెడుతున్నారు. వీరు బయటకు వస్తే సాక్ష్యులను కూడా భయభ్రాంతులకు గురిచేసే అవకాశం ఉండటంతో నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. జైలులో ఉన్న వ్యక్తుల కేసుల ట్రయల్స్ త్వరితగతిన పూర్తయి ఆధారాలు లభిస్తే వారికి జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

నియంత్రణ చట్టం అమలు

వరుస నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు గుర్తించి వారు మళ్లీ తిరిగి నేరం చేయకుండా నియంత్రణ చట్టం 1986 (చట్టం సంఖ్య 1/986 తెలంగాణ నియంత్రణ చట్టం ద్వారా పీడీయాక్ట్ చట్టం నేరస్తులపై అమలు చేస్తున్నారు.

నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు

- జిల్లాలో మహిళలపై వేధింపులు, రేషన్ బియ్యం అక్రమ దందా, గల్ఫ్‌కు పంపిస్తామని మోసం, వరుస దొంగతనాలు, మోసాలు, మహిళలను లైంగికంగా వేధించిన, హత్య కేసుల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులపై పీడీయాక్ట్‌నమోదు చేస్తున్నారు. పీడీ యాక్ట్ నమోదుతో నేరస్తులు ఎక్కువ కాలం జైలులోనే ఉంటున్నారు. సుమారు సంవత్సర కాలంపాటు వీరికి బెయిల్ దొరికే అవకాశం లేదు. దీంతో జైలులో ఉంటే సత్ప్రవర్తన చెందుతారని పోలీసులు వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు.

- కోరుట్ల పట్టణానికి చెందిన కౌన్సిలర్ ఉమారాణి భర్త పోగుల లక్ష్మీరాజంను ఆగస్టు 8న హత్య చేసిన కేసులో తొమ్మిది మంది నిందితులపై మూడు రోజుల క్రితం పీడీయాక్ట్ కేసు నమోదు చేశారు.
- 2023 ఫిబ్రవరి 23న కొండగట్టు పుణ్యక్షేత్రంలో దొంగతనానికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులపై పీడీయాక్ట్ కేసు నమోదు చేశారు.
- 2019లో శాంతిభద్రతల పర్యవేక్షణకు విఘాతం కలిగించిన ఘటనలో ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై, మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై పీడీయాక్ట్ నమోదు చేశారు.
- 2021లో ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై యాసిడ్ దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులపై పీడీ యాక్ట్ తెరిచారు. అలాగే మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై పీడీయాక్ట్ తెరిచారు.
- 2022లో సెప్టెంబర్ 5న గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డ కొడిమ్యాల హరికృష్ణపై పీడీయాక్ట్ అమలు చేశారు. ధర్మపురి, సారంగాపూర్, జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడ్డ జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన చేని సంతోష్, హబ్సీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్యలపై పీడీయాక్ట్ తెరిచారు.

శాంతిభద్రతలు కాపాడేందుకు



"జిల్లాలో వరుస నేరాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు పీడీయాక్ట్ కేసు నమోదు చేస్తున్నాం. వరుస నేరాలకు పాల్పడుతూ ప్రజలను శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై పీడీయాక్ట్ నమోదు చేశాం.

– ప్రభాకర్‌రావు, అడిషనల్ ఎస్పీ, జగిత్యాల

దివ్యాంగులకు అవకాశం

- ఇంటి వద్దనే ఓటు వేయొచ్చు..
- పోస్టల్ బ్యాలెట్ ద్వారానే సదుపాయం


ఓటు వినియోగించుకుంటున్న దివ్యాంగులు (ఫైల్)

జగిత్యాల/రాయికల్: దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిస్తోంది. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో దివ్యాంగులు 32,342 మంది, 80 ఏళ్లు దాటిన వారు 12,077 మంది ఉన్నారు. వీరి కోసం ఈసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పోలింగ్ కేంద్రాలకు రాలేని పరిస్థితిలో ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల సిబ్బంది వారి ఇంటికి వచ్చి ఓటు వేసేలా చూస్తారు.

ఫారం 12 డి

దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేయడానికి ప్రత్యేకంగా ఫారం 12డీ ఉంటుంది. ఈ ఫారంలో నింపి రిటర్నింగ్ అధికారికి పంపించాలి. ఇందులో అన్ని వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. అనంతరం రిటర్నింగ్ అధికారి ఈ ఫారంను పరిశీలించి అర్హత ఉంటే ఇంటి నుంచి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. అంతేకాకుండా ఈ ఓటు రహస్యంగా ఉంచడంతోపాటు, ఓటింగ్ ప్రక్రియను సైతం వీడియో తీయనున్నారు. ఇప్పటికే ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, వీరికి వీల్‌చైర్ సౌకర్య కల్పించినప్పటికీ పూర్తిగా రాలేని వారికి ఈ అవకాశం కల్పించారు. దీంతో దివ్యాంగులు, వృద్ధుల ఓటింగ్ పెరిగే అవకాశాలుంటాయి.

బోర్డు కాదు.. మద్దతు ధర ఇవ్వండి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: పసుపు బోర్డు తెచ్చామని బీజేపీ గొప్పలు చెప్పుకోవడం కాదని, ప్రస్తుత సీజన్‌లో రైతులు సాగు చేసిన పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర ఇవ్వాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో శనివారం మాట్లాడారు. జిల్లాలో ఒకప్పుడు 40 వేల ఎకరాల్లో పసుపు సాగు విస్తీర్ణం ఉంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకుల తీరుతో 18వేల ఎకరాలకు పడిపోయిందన్నారు. ఒకప్పుడు బంగారంతో పోటీ పడిన పసుపు చతికిలపడటానికి బీజేపీ నాయకులే కారణమన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంట మాదిరిగా కేంద్రం పసుపు పంటకు ఎందుకు మద్దతు ధర ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అమాయక రైతులను మోసగించేందుకు పసుపు బోర్డు పేరిట బీజేపీ నాటకమాడుతోందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సంకల్పంతో చెరువులు, కుంటలను మరమ్మతు చేయడం, ఎస్సారెస్పీ, వరద కాలువ, కాళేశ్వరం నీళ్లతో అనుసంధానం చేయడంతో జిల్లాలో రెండు సీజన్లలో వరి సాగు విస్తీర్ణం ఘణనీయంగా పెరిగిందన్నారు. జిల్లాలో ఒకప్పుడు వరి సాగు లక్ష ఎకరాల్లో ఉంటే.. ఇప్పుడు మూడు లక్షల ఎకరాలకుపైగా సాగవుతోందని వివరించారు. కేసీఆర్ సర్కార్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతో ఇతరదేశాలకు బియ్యం ఎగుమతి చేసేందుకు కేంద్రప్రభుత్వం అవరోధాలు సృష్టిస్తుందన్నారు. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీ మూయించింది చంద్రబాబు అయితే.. కొనుగోలు చేసింది బీజేపీ ఎంపీ అని ఎద్దేవా చేశారు. షుగర్ ఫ్యాక్టరీని నడిపించేందుకు కేసీఆర్ ముందుకొచ్చి నిధులు ఇస్తామంటే కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు చెప్పులు, పాస్‌బుక్కులను లైన్లలో పెట్టి ఇబ్బంది పడిన సంఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ మహేశ్, నాయకులు గట్టు సతీష్, బాల ముకుందం, దామోదర్‌రావు, దావ సురేష్, మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, హరీష్, ఆసిఫ్, లక్ష్మణ్‌రావు, మహేశ్వర్ రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిల్లల కోసమే తొలిమెట్టు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

జగిత్యాల: పిల్లల కోసమే తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో ఉన్నత విద్యాక మిషన్ కరుణ ఆదేశాల మేరకు శనివారం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు మెరుగుపడేలా ఆటపాటలతో ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల్లో చురుకుదనం, చదువుపై శ్రద్ధ లాంటివి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ పడాల తిరుపతి, సమన్వయ కర్తలు శ్రీనివాస్‌రెడ్డి, జమున, సత్యప్రకాశ్, హర్జాత్‌ఖౌర్, సునీత, మాదవి, జ్యోత్స్న, సంతోష్, సాయి, తిరుపతి పాల్గొన్నారు.

గెజిటెడ్ హోదా కల్పించాలి



రాష్ట్ర డైరెక్టర్‌ను సత్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: లైఫ్‌స్టాక్ ఆఫీసర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌ను శనివారం సత్కరించారు. పశు వైద్య శాఖలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్, కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆనంద్, ఎలిగేటి రవీందర్, మహ్మద్ ఆజాంఖాన్, దైవవీణ, రాజేశ్, రవి, నాగరాజు, ప్రశాంత్, అజీజ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాయికల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. మండలంలోని ఇటిక్యాల వాగు నుంచి కుంచపు హరీశ్ అనే ట్రాక్టర్ డ్రైవర్ ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని, ట్రాక్టర్ డ్రైవర్ హరీశ్‌తోపాటు, యజమాని నడిపివెంకటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

రాయికల్: మండలకేంద్రానికి చెందిన ఇద్దరిపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. రాయికల్‌కు చెందిన అవుదుర్తి విష్ణు, గణేశ్ తమ స్నేహితుడు ఉమేశ్‌చంద్రతో గ్రౌండ్‌లో మాట్లాడుతున్నాడు. పైడిమర్రి శ్రావణ్ వారి వద్దకు వచ్చి ద్విచక్రవాహనం అడిగాడు. వారు నిరాకరించడంతో శ్రావణ్ వారితో వాగ్వివాదానికి దిగాడు. శ్రావణ్ బీరు సీసాతో గణేశ్ తలపై కొట్టాడు. శ్రావణ్ అన్న కళ్యాణ్ అక్కడికి చేరుకుని విష్ణుపై దాడికి పాల్పడ్డాడు. గణేష్, విష్ణు గాయపడడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. విష్ణు ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



జగజ్జనని.. శక్తి స్వరూపిణి

విజయలక్ష్మీగా జనుల ఆనందోత్సవాలకు ప్రతీకగా పై త్రిశూల ధారిణిగా స్త్రీ శక్తిని లోకానికి తెలియజేసింది. కుష్మాండ దుర్గ

- నేటి నుంచి దేవి నవరాత్రోత్సవాలు
- వేడుకలకు సిద్ధమైన మండపాలు

కరీంనగర్‌కల్చరల్: అమ్మలగన్న అమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. త్రిశక్తి స్వరూపిణి.. సకల జగత్తుకు మూలం, త్రిమూర్తులకు శక్తి ప్రదాత, త్రిలోకేశ్వరీ సకలాభీష్ట ప్రదాయిని అయిన దేవి నవరాత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల్లో తొలిరోజు అమ్మవారిని కలశ స్థాపనం చేసి ప్రతిష్ఠిస్తారు. అప్పటి నుంచి విజయదశమి వరకు దేవీనవరాత్రులు నిర్వహిస్తారు.

తొమ్మిది అవతారాలు

- శక్తి స్వరూపిణి, ఆది పరాశక్తి అయిన దుర్గా మాతను శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయణి, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిరాత్రి తొమ్మిది అవతారాల్లో భక్తులు కొలుస్తారు.

ప్రీతిపాత్రమైన రోజులు

- రుద్ర రూపిణి భద్రకాళిగా ఎనిమిదవ రోజు జన్మించిన చాముండి తొమ్మిదవ రోజు వీర విహారం చేసి దైత్య సంహారం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. పదో రోజు పూజలందుకుంటుంది. నవరాత్రుల్లో చివరి మూడురోజులు అత్యంత ప్రీతిపాత్రమైనవి. వీటినే మనం దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి పేరిట ఉత్సవాలు జరుపుకుంటాం. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనం ఇస్తారు.

శైలపుత్రి

- చైతన్యశక్తి శైలపుత్రి, త్రిమూర్తి స్వరూపిణి ఆది పరాశక్తి సతీదేవిగా యోగాగ్నిలో తనువు చాలించింది. తిరిగి మీనా హిమవంతులకు శైలపుత్రీదేవిగా జన్మించింది. నందివాహనం

బ్రహ్మచారిణి

- సంకల్పబలం బ్రహ్మచారిణి. బ్రహ్మచారినిగా నియమనిష్ఠలతో తపస్సు చేసి శివుడిని వరించింది. చేతిలో కమండలంతో మాలధారిణిగా నిత్య తపో ముద్రాంకితగా దర్శనమిస్తుంది. ఈ రూపంలోని దుర్గాను ఆరాధించినవారికి ఏకాగ్రత దీక్ష అలవడుతుంది.

చంద్రఘంటాదేవి

- మనసుకు మార్గదర్శి చంద్రఘంటాదేవి. ఈ రూపంలో అమ్మవారిని ఆరాధించేవారికి శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని ప్రతీతి.

- సర్వ దుఃఖహారిణి కుష్మాండదుర్గ. శారీరక, మానసిక రుగ్మతలను పారదోలే రూపం కుష్మాండదుర్గ. వర, అంకుశ, పాశ, అభయ ముద్రలతో కూడిన అష్ట భుజాలతో కోటి సూర్యప్రభలతో ప్రకాశించే జనని అభయ ప్రదాయిని.

స్కంధమాత

- మాతృదేవోభవ అనే సందేశాన్ని, అమ్మతత్వాన్ని మానవాళికి ప్రబోధంగా, మాతలకే మాతా అయి శ్వేత వర్ణశోభితగా, ఆదిమాతగా కుమారస్వామిని లాలించే అమ్మ రూపంలో వెలుగొందే దివ్యమూర్తి.

జ్ఞానశక్తి కాత్యాయనీదేవి

- సృష్టి, స్థితి, లయలకు హేతువైన శక్తి. సకల సంసార బంధాలకు కారుకురాలు. భవసాగరాల నుంచి మానవుల్ని ఉద్ధరించే శక్తి. సింహ వాహనం అధిరోహించి కరవాలం చేబుని రాక్షసత్వాన్ని పారదోలే జగద్రక్షిణిగా శోభిల్లుతుంది.

కాళరాత్రి

- ప్రాణికోటి జీవితాల్లోని గ్రహబాధలు తొలగించి మృత్యువుకే భయం కలిగిస్తూ దుర్గుణాలు, దుష్ట శక్తులను పారదోలి సత్యకర్మల్ని ప్రేరేపిస్తూ మంచి బుద్ధిని పెంచుతుంది.

మహాగౌరీ

- మంగళ స్వరూపిణి మహాగౌరి. ఆదిపరాశక్తి భయంకర కాళ స్వరూపాన్ని విసర్జించిన అమ్మవారు ధవళకాంతితో వెలిగిపోయే మంగళ స్వరూపిణిగా మహాగౌరి అవతరించింది. తెల్లని వస్త్రాలు ధరించి, త్రిశూలం చేబూని శతకోటి దివ్యకాంతుల్ని భక్తజనకోటికి అభయ ప్రదానం చేస్తూ శోభిల్లుతుంది.

సిద్ధిధాత్రి

- మోక్షప్రదాత్రి సిద్ధిధాత్రీ. భౌతిక జీవనంలో సర్వసిద్ధులూ అనుగ్రహించే సిద్ధిధాత్రి అద్వైత సిద్ధికి ప్రేరణనిస్తుంది. అష్ట సిద్ధులను మోక్షమును ప్రసాదిస్తుంది.

అపరాజిత

- అపరాజిత శ్రీరాజేశ్వరీదేవి. సర్వమానవ జీవితాల్లో సర్వశక్తికి కేంద్రస్థానం జగజ్జననే. శరన్నవరాత్రుల్లో అమ్మవారికి విశేష అలంకారాలు ముగిశాక విజయదశమి రోజు శ్రీరాజరాజేశ్వరిగా దర్శనమిస్తుంది.

తప్పు చేసినట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

- నాలుగున్నరేళ్లలో ఎంపీ ఏం చేశారో చెప్పాలి
- ఎంపీ అర్వింద్‌కు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల: తను తప్పు చేసినట్టుగానీ.. లంచం తీసుకున్నట్టుగానీ ఎంపీ అరవింద్ నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మెట్‌పల్లి సభలో పిచ్చికూతలు కూశారని, ఆయన నాలుగున్నరేళ్లలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పసుపు బోర్డు తెచ్చానని సంబరాలు చేసుకుంటున్న ఆయన దానిని ఎక్కడ పెడతారో స్పష్టం చేయాలన్నారు. ఆయన సంబరాల్లో బీజేపీ కార్యకర్తలు తప్ప రైతులెవరూ కనిపించటం లేదన్నారు. అర్వింద్ కోరుట్ల నుంచి పోటీ చేస్తే తమకు భయం లేదని, ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసని, వారే సరైన తీర్పు ఇస్తారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌ను దుర్భాషలాడడం సరికాదన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్ని పార్టీలూ తిరిగి ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నంతమాత్రాన సీనియర్ నాయకులను కించపర్చడం సరికాదన్నారు. ఎవరెన్ని పిచ్చి కూతలు కూసినా కోరుట్లలో ఎగిరేది మళ్లీ బీఆర్ఎస్ జెండానే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, జిందం లక్ష్మీనారాయణ, ఆడెపు కమలామధు, సింగిల్‌విండో చైర్మన్ ఎలిశెట్టి భూమారెడ్డి, కల్లూర్ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీజేఎస్ మండల అధ్యక్షుడిపై దాడికి యత్నం

ఇబ్రహీంపట్నం: తెలంగాణ జన సమితి మండల అధ్యక్షుడు కంతి రమేశ్‌పై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించారు. స్థానికుల కథనం ప్రకారం.. రమేశ్ పార్టీ కార్యాలయం వద్ద కొందరితో కలిసి మాట్లాడుతుండగా.. మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఒక్కసారిగా బీరు సీసాలతో దాడికి యత్నించారు. అప్రమత్తమైన రమేశ్ వారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. దాడికి యత్నించిన వారిలో ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బీజేపీ నాయకుడు జీఎస్ వెంకట్‌పై టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, రమేశ్ శుక్రవారం దాడికి పాల్పడ్డారు. మరుసటి రోజే రమేశ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించడం చర్చనీయాంశమైంది.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల బుడిగజంగాల కాలనీలో అన్నదమ్ములపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాలనీకి చెందిన పాస్తం దశరథ్ అదే గ్రామానికి చెందిన బాపగల్ల నరేశ్‌కు రూ.200 బదలు ఇచ్చాడు. చాలారోజుల తరువాత దశరథ్ డబ్బు తిరిగి ఇవ్వాలని నరేశ్‌ను కోరాడు. తననే డబ్బులు అడుగుతావా అంటూ నరేశ్ ఆయన మిత్రుడు పురాణం రవితో కలిసి దశరథ్‌తోపాటు అతడి తమ్ముడు అంజిని చితకబాదారు. దశరథ్ అక్క స్వప్న ఫిర్యాదు మేరకు నరేశ్, రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరికొండలో దొంగతనం

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండలో తాళం వేసి ఉన్న ఇంట్లో శనివారం ఉదయం దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఏనుగు హరిదాస్ తన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. వచ్చి చూసే సరికి తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. రూ.1.20లక్షలు కనిపించలేదు. గ్రామస్తుల సహకారంతో పరిసర ప్రాంతాల్లో వెదికారు. గత్యంతరం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డాగ్‌స్క్వాడ్ బృందాలు సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

టీజేఎస్ నాయకులపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీఎస్.వెంకట్‌పై దాడి చేసిన తెలంగాణ జనసమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, పార్టీ నాయకుడు కంతి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. దుర్గాదేవి మండపం ఏర్పాటు విషయంలో గొడవ జరగగా.. బీజేపీ నాయకుడు వెంకట్‌పై టీజేఎస్ నాయకుడు మోహన్‌రెడ్డి, రమేశ్ శుక్రవారం దాడి చేసిన విషయం తెల్సిందే. వెంకట్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డెంగీతో యువకుడు మృతి



గంగారపు గోపి (ఫైల్)

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రానికి చెందిన గంగారపు గోపి (36) డెంగీతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గోపి నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

కామెంట్ చేస్తే కేసులే..

- ఎన్నికల కమిషన్ నిఘా
- అడ్మిన్లు కూడా బాధ్యులే

రాయికల్: ఓ పార్టీకి చెందిన గ్రూపులో అనుకూలంగా కార్యకర్త పోస్టు పెడితే అదే గ్రూపులో మరొకరు వ్యతిరేకిస్తూ మరో పోస్టు పెడుతున్నారు. అదే గ్రూపులో మరికొంత మంది తమకు నచ్చిన నాయకులపై ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ విమర్శ, ప్రతి విమర్శలకు వెళ్తున్నారు. ఇలాంటి వాటికి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్ పెట్టేందుకు ఎన్నికల కమిషన్ అడ్మిన్‌తోపాటు, పోస్టు పెట్టిన వారిపై చర్యలు తీసుకునేందుకు సోషల్ మీడియా (వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ (ట్విట్టర్))పై ప్రత్యేక నిఘా పెట్టింది.

ప్రత్యేక నిఘా

సోషల్ మీడియాపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెట్టింది. గ్రూపుల్లో పార్టీలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా, నాయకులను కించపరిచినట్లు, అవహేళన చేస్తూ వీడియో క్లిప్‌లు పోస్ట్ చేసినా, వారి మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించినా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు. ఐటీ చట్టంతో ఎన్నికల సమయంలో కేసులు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

యువత అప్రమత్తంగా ఉండాల్సిందే...

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో యువత, నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. తమకు ఉద్యోగం రాలేదనే నిరుత్సాహంతో పార్టీలపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారి భవిష్యత్‌కే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. సాధారణంగా పోలీసులు పెట్టే కేసుల కంటే ఎన్నికల సమయంలో పెట్టే కేసుల ప్రభావం వారి జీవితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఉద్యోగాలకు సైతం దూరం కానున్నారు.

గ్రూపు అడ్మిన్లదే బాధ్యత



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో ప్రజలను, వివిధ పార్టీలకు చెందిన నాయకులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా, వాటికి కామెంట్ పెట్టిన వారిపై సైతం కేసులు పెట్టే అవకాశం ఉంది. దీనిపై పూర్తిగా అడ్మిన్లే బాధ్యత వహిస్తారు. దీని కోసం ఐటీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం.
– వెంకటస్వామి, డీఎస్పీ, జగిత్యాల

బలిదానాలు రాష్ట్రానికి మంచిది కాదు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: నిరుద్యోగుల బలిదానాలు రాష్ట్రానికి మంచిది కాదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతారం, సారంగాపూర్ గ్రామాల్లో శనివారం పర్యటించారు. కాంగ్రెస్ నాయకుడు మల్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా జీవన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోతారంలో మాట్లాడుతూ రాష్ట్రం వస్తే బతుకులు బాగుపడతాయని భావించామని, పదేళ్లలో ఉద్యోగ నియామకాలు జరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వివరణ కూడా సరిగా లేదన్నారు. మల్యాల శ్రీనివాస్, గంగాడి భూమారెడ్డి, కందుల శంకర్, మల్యాల లింగారెడ్డి, కరబూజ శ్రీనివాస్, సింగం రమేశ్, మడ్డి సత్తయ్య, ఆనెగాళ్ల గంగారాం, రాజిరెడ్డి, మడ్డి చందు, కొత్తపల్లి రాజేశం,మడ్డి మురళి, బొనగాని భరత్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పర్యటనకు తరలిరావాలి

కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఈనెల 18న జగిత్యాలకు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని జీవన్‌రెడ్డి కోరారు. జగిత్యాల న్యూబస్టాండ్ ప్రాంతంలోని సర్దార్‌పటేల్ విగ్రహం వద్ద బహిరంగ సభలో రాహుల్‌తోపాటు ప్రియాంకగాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

కేవీ.నరేందర్ కథలపై ఇద్దరికి పీహెచ్‌డీ



కేవీ.నరేందర్



నరేందర్ రచించిన కథమానసంభవతి

జగిత్యాల: జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ కథారచయిత కేవీ.నరేందర్ కథలపై పరిశోధనలు చేసిన ఇద్దరు పీహెచ్‌డీ పట్టాలు పొందారు. త్వరలో ఆయా యూనివర్సిటీల స్నాతకోత్సవంలో వీరికి డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ కేవీ నరేందర్ 'రచనలు పరిశీలన' అంశంపై పరిశోధన చేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన శివకుమారి నరేందర్ కథల్లో 'శిల్పనైపుణ్యం' అంశంపై పరిశోధన చేశారు. వీరిద్దరికీ డాక్టరేట్ లభించింది. రవీందర్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధన చేయగా.. శివకుమారి ప్రొఫెసర్ ఖాసీం పర్యవేక్షణలో పరిశోధన చేశారు. కేవీ.నరేందర్‌ది జిల్లాలోని గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇప్పటివరకు ఆయన 187 కథలు, నాలుగు నాటికలు, 26 కవితలు, 12 వ్యాసాలు రాశారు. 2016లో ఉత్తమ రచయితగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల జీవితాల్లో వెలుగు



కాంగ్రెస్‌లో చేరిన యువతతో లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం అంబరిపేటకు చెందిన సుమారు 150 మంది యువకులు లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు నిండా మునిగారని అన్నారు. నోటిఫికేషన్లు లేక.. ఒకవేళ ఇచ్చినా రద్దవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు.

నియంతలా వ్యవహరిస్తున్న మంత్రి ఈశ్వర్

బుగ్గారం: మంత్రి కొప్పుల ఈశ్వర్ నియంతలా వ్యవహరిస్తూ నియోజకవర్గంలో రాచరిక పాలన కొనసాగిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు అన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ధర్మపురి అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించినా అవి ఎటు వెళ్లాయో తెలియడం లేదన్నారు. ఈ ప్రాంత రైతులను మిల్లర్లు దోపిడీకి గురిచేసినా మంత్రి కనీసం స్పందించలేదన్నారు. ఆయా గ్రామాల యువత కాంగ్రెస్‌లో చేరగా.. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంసీసీ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, నాయకులు సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, రాందేని మొగిలి, నర్సింహులు, భూమేశ్, పోచయ్య, ఆశెట్టి శ్రీనివాస్, సుముఖ్, సాయిప్రశాంత్, జంజీరికాని భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై

మైట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఓ శిశువు మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే అని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా దోమచందకు చెందిన హారతిని ప్రసవం నిమిత్తం కుటుంబ సభ్యులు శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు జరిపిన వైద్య సిబ్బంది నార్మల్ ప్రసవం కోసం ప్రయత్నించారు. సాయంత్రం వరకూ సాధ్యం కాకపోవడంతో సీజేరియన్ చేయగా మగ శిశువు జన్మించాడు. అనంతరం బాబుకు పరీక్షలు జరిపి పరిస్థితి విషమంగా ఉండడంతో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ప్రసవం చేయడంలో జాప్యంతోనే శిశువు మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై చిరంజీవి అక్కడకు చేరుకొని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి



సంజయ్‌కుమార్ ప్రచారం

జగిత్యాల: పదేళ్లలో జగిత్యాలను రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జగిత్యాలకు శాశ్వత మురికినీటి పరిష్కారానికి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థకు కేటీఆర్ హామీ ఇచ్చారని, యావర్‌రోడ్ 100 ఫీట్లతో వెడల్పు చేస్తామని తెలిపారు. వీధివ్యాపారులకు శాశ్వత షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలే తన కుటుంబమని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ముజాహిద్, ఫిర్దోస్ పాల్గొన్నారు.

విద్యాసాగర్‌రావుకు 'షాషా' సెంటిమెంట్

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పార్టీ బీ ఫాం తీసుకునే ప్రతిసారి తన మనమరాలు, సంజయ్ కూతురు కల్వకుంట్ల షాషాను వెంట తీసుకెళ్లడం సెంటిమెంట్. పార్టీ అధినేత కేసీఆర్ నుంచి.. తరువాత కల్వకుంట్ల షాషా చేతుల మీదుగా విద్యాసాగర్‌రావు బీ ఫాం తీసుకునేవారు. ఆ సెంటిమెంట్‌తో నాలుగుసార్లు కోరుట్ల నుంచి వరుసగా గెలి చారు. ఇప్పుడు ఆయన తనయుడు కల్వకుంట్ల సంజయ్ కూడా తన వెంట షాషాను తీసుకెళుతున్నారు. ముందుగా కేసీఆర్ నుంచి.. తర్వాత షాషా నుంచి బీ-ఫాం అందుకోనున్నారు.